
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY







జాతీయ రహదారికి రూ.3,200 కోట్లు

ఆకివీడు- దిగమర్రు హైవేకు

కొత్త డీపీఆర్ సిద్ధం.. కేంద్రానికి నివేదిక

భీమవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 165 జాతీయ రహదారి అంచనాలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఎస్ఎస్ఆర్ ధరల ఆధారంగా జాతీయ రహదారికి సంబంధించి కొత్త ప్రాజెక్టు నివేదిక తయారుచేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారు. ఆకివీడు నుంచి దిగమర్రు వరకు 45 కిలోమీటర్ల పొడవునా 4 లేన్‌ల రహదారికి సుమారు రూ3,200 కోట్లు అవసరం అవుతుందని అంచనా వేశారు. వాస్తవానికి గతేడాది రూ.2,400 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. డీపీఆర్‌కు సాంకేతికంగా ఆమోద ముద్ర వేశారు. కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపితే టెండర్లు పిలిచేవారు. ఐతే క్యాబినెట్ ఆమోదం పొందకుండా ఆర్థిక సంవత్సరం ముగిసిపోయింది. కొత్త ఎలైన్‌మెంట్ ప్రకారం జాతీయ రహదారి నిర్మాణానికి ప్రాజెక్టు నివేదిక మనుగడలోనే ఉంది. తాజాగా కొత్త ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం డీపీఆర్ మార్పు చెయ్యాలంటూ కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఐతే దాని ఆధారంగా 100 కోట్లు పెంచి సుమారు రూ. 2,500 కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. జిల్లాలో భూమి ధరలు అధికంగా ఉన్నాయి. దానికి తోడు నిర్మాణ వ్యయం పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఎస్ఎస్ఆర్ ధరలను విడుదల చేసింది. ఆ మేరకు మరోసారి ప్రాజక్టు నివేదిక తయారు చేశారు. ఫలితంగా ఆకివీడు నుంచి దిగమర్రు వరకు నాలుగు లేన్‌ల రహదారికి రూ.3,200 కోట్లు వ్యయం కానుందని అంచనా వేసి కేంద్రానికి డీపీఆర్ సమర్పించారు. కేంద్ర మండలి ఆమోదించిన తరువాత టెండర్లు పిలవనున్నారు. మార్చి 31 వరకు తాజా గా పంపిన డీపీఆర్ మనుగడలో ఉండాలంటే ఈలోగానే కేంద్ర మంత్రిమండలి ఆమోదం తెలపాలి. టెండర్ల దశకు ప్రాజెక్టు చేరుకోవాలి. ఈ విషయంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ధీమాతో ఉన్నారు. నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మాణం జరిగితే పశ్చిమ గోదావరి జిల్లా రూపురేఖలు మారనున్నాయి. ముఖ్యంగా భీమవరం ప్రాంతం అభివృద్ధికి నోచుకోనుంది.



పడకేసిన మునిసిపల్ రెవెన్యూ

పేరుకుపోయిన దుకాణ అద్దె బకాయిలు

రూ.40 లక్షల వరకు పెండింగ్

నరసాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పురపాలకంలో రెవెన్యూ విభాగం పడకేసింది, ప్రతి నెల దుకాణదారుల నుంచి వసూలు చేయాల్సిన అద్దెల్ని క్రమంగా వసూలు చేయకపోవడంతో బకా యిలు రూ.40 లక్షలకు చేరాయి. ఇందులో మూడు నెలలు దాటి అద్దె చెల్లించని దుకాణదారులు కూడా ఉన్నారు. ఇలా బకాయిలు పేరుకుపోవడంపై భిన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి.కొన్ని దుకాణ వసూళ్లలో రాజకీయ ఒత్తిళ్లతో సిబ్బంది వెనకడుగు వేస్తున్నారు. మరి కొన్నిటిలో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ కారణంగానే బకాయిలు పేరుకు పోయాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. పురపాలక సంఘానికి పట్టణ పరిధిలో 14 షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. అందులో అద్దెలు ఎక్కువగా కొప్పర్తి, యర్రమిల్లి, అల్లూరి కాంప్లెక్స్‌ల నుంచి వస్తుంటాయి. మొత్తం అన్ని కాంప్లెక్స్‌లు కలిపి 230 దుకాణాలు ఉన్నాయి. అందులో 50 దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన దుకాణాల్లో కొందరు నెల వారీగా అద్దెలు చెల్లిస్తుంటే మరికొందరు సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో ఇంత పెద్ద మొత్తంలో బకాయి పేరుకుపోయింది.గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదు. మొత్తం పురపాలక సంఘానికి ఏటా పన్నుల రూపంలో సుమారు రూ.8.50 కోట్ల వరకు అదాయం వస్తుంది. అందులో ఇంటి పన్నులపై రూ.6 కోట్లు, నీటిపన్ను రూ.కోటి, మార్కెట్ పాట ద్వారా రూ.50 లక్షలు, దుకాణాలపై రూ.80 లక్షల వరకు ఆదాయం వస్తుంది. వీటిలో అత్యధికంగా దుకాణ అద్దెలు పేరుకుపోయాయి. దీనిపై ఆర్వో మురళీ వివరణ ఇస్తూ బకాయిలు పేరుకు పోయిన విషయం వాస్తమన్నారు. వీటిని వసూలు చేసేందుకు టీమ్‌లు వేశామన్నారు. మూడు నెలలు అద్దె చెల్లించని దుకాణాలకు తాళం వేయనున్నట్లు చెప్పారు

ఎన్నాళ్లో వేచిన ఉదయం


ఉమ్మడి పశ్చిమలో 1063 ఉపాధ్యాయ ఉద్యోగాలకు అభ్యర్థుల ఖరారు

దేవస్థానం రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్ 7

అరచేతిలో సస్య రక్షణ

» సెల్‌ఫోన్‌లో ప్రత్యేక యాప్, క్యూఆర్ కోడ్

» తెగుళ్ల గుర్తింపు.. నివారణ సూచనలు 6



ఆక్వాకు ఆసరా





సదస్సులో కలెక్టర్ నాగరాణి

అప్పడా రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఆక్వా రైతులకు నెల గడువు

సీఎం దృష్టికి ఎల్‌పీఎం సమస్య

వెసులుబాటు ఇవ్వాలని కోరిన కలెక్టర్

జిల్లాలో 16 వేల విద్యుత్ కనెక్షన్‌లు

13 వేల కనెక్షన్‌లకు రాయితీ

రిజిస్ట్రేషన్ చేసుకుంటే

నాన్ ఆక్వా జోన్‌లోనూ వర్తింపు

సచివాలయంలో కలెక్టర్‌లతో సీఎం కాన్ఫరెన్స్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ఆక్వా రంగం ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఒకవైపు వైరస్‌లు, మరోవైపు ట్రంప్ సుంకాలు వెంటాడుతున్నాయి. ఇటువంటి తరుణంలో ఆక్వా రైతులకు మరింత అండగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ పరంగా ప్రోత్సాహకాలు అందించాలన్నా, ఆక్వా ఉత్పత్తు లకు మార్కెట్ ఉండాలన్నా అప్పడాలో రిజిస్ట్రేషన్ చేసు కోవాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికోసం ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు నెలరోజులు గడువు ఇచ్చారు. రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటే ల్యాండ్ పార్సిల్ మ్యాపింగ్ (ఎల్‌పీఎం) సమస్య వస్తోంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సచివాలయంలో కలెక్టర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఈ విషయమై చర్చించారు. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆక్వా చెరువుల రిజిస్ట్రేషన్‌పై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లారు. జిల్లాలో 15 వేల ఎకరాల్లోనే రైతులు అప్పడాలో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరో 80 వేల ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. రీసర్వేలో భాగంగా ల్యాండ్ పార్సిల్ మ్యాపింగ్ పూర్తి కాకపోవడంతో రిజిస్ట్రేషన్ సమస్య ఎదురవుతోంది. దీనిపై వెసులుబాటు కల్పించాలంటూ ముఖ్యమంత్రిని కలెక్టర్ కోరారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. నెలరోజులు గడువు ఇచ్చారు. ఇప్పటిదాకా రిజిస్ట్రేషన్ లేకపోయినా సరే విద్యుత్ కనెక్షన్‌లకు రాయితీ ఇస్తున్నారు. ఆక్వా జోన్‌లో 10 ఎకరాల లోపు చెరువు విస్తీర్ణం ఉన్నవారికి మాత్రమే యూనిట్ విద్యుత్‌ను రూ.1.50 పైసలకు అందజేస్తున్నారు.

నాన్ ఆక్వాజోన్ రైతులకు ఊరట

రాష్ట్ర ప్రభుత్వం నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న రైతులకు కూడా విద్యుత్ రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. అయితే అప్పడాలో రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి అని ముఖ్యమంత్రి ప్రకటించారు. జిల్లాలో ఆక్వా రంగానికి 16 వేలు విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. అందులో 13 వేల కనెక్షన్‌లకు రాయితీ వర్తిస్తోంది. మిగిలిన మూడు వేల కనెక్షన్‌లకు 10 ఎకరాలకు పైగా ఉందనో నాన్ ఆక్వా జోన్ అనో రాయితీ ఇవ్వడం లేదు. తాజాగా నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న చెరువులకు కూడా రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. నెల రోజుల వ్యవధిలోనే అప్పడాలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తర్వాత రాయితీ ఉండదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు.ఎల్‌పీఎం విషయంలోనూ వెసులుబాటు ఇచ్చారు. తాజాగా మరో 3,000 మంది రైతులు కొత్త విద్యుత్ కనెక్షన్‌లకు దరఖాస్తు చేసుకు న్నారు. వారికి కూడా కనెక్షన్‌లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.అయితే నెల రోజుల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలంటూ ప్రభుత్వం దిశానిర్దేశం చేసింది. చెరువులు రిజిస్ట్రేషన్ చేసుకుంటే నాసిరకం సీడ్‌ను అరికట్టే అవకాశం ఉంటుంది. రొయ్య సాగులో యాంటీ బయోటిక్ మందుల వాడకాన్ని నివారించవచ్చు. తద్వారా ఆక్వా ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఉంటుంది. ఎగుమతి దారులు కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారివే ముందుగా కొనుగోలు చేయ నున్నారు. ప్రభుత్వం ఇచ్చే రాయితీలు కూడా ఇకపై రిజిస్ట్రేషన్ చేసుకున్న చెరువులకే వర్తించనుంది.



సీఎంతో లంచ్ కార్యక్రమంలో మంత్రి నిమ్మల

స్వర్ణాంధ్ర సాధనలో తొలిస్థానం

పశ్చిమగోదావరి జిల్లా పురోగతిలో పయనిస్తోంది. కూటమి ప్రభుత్వం నిర్దేశించిన స్వర్ణాంధ్ర సాధనలో 65 పాయింట్లతో ముందు వరుసలో నిలచింది. అన్ని జిల్లాలకు ఈ విషయంలో బీ-గ్రేడ్ మాత్రమే దక్కింది. అత్యధికంగా 65 పాయింట్‌లతో పశ్చిమగోదావరి ముందుంది. వ్యవసాయం అనుబంధ రంగాల్లో 2025-26 సంత్సరంలో జిల్లా 34,310 వేల కోట్ల ఆదాయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల వృద్ధిలో అన్ని జిల్లాలు సి-గ్రేడ్ మార్క్‌లను మాత్రమే సాధించాలి పశ్చిమగోదావరి జిల్లా కూడా 32 మార్కులతో సి-గ్రేడ్‌కు పరిమితమైంది. పశ్చిమ గోదావరి జిల్లా లక్ష్య సాధనలో ముందడుగు వేస్తోంది. అన్ని జిల్లాల కంటే తొలి త్రైమాసికంలో 21.55 శాతం లక్ష్యాన్ని చేదించింది. పారిశ్రామిక రంగం వృద్ధిలోనూ ఎ-గ్రేడ్‌ను సొంతం చేసుకుని ఇతర జిల్లాలతో పోటీ పడుతోంది.

తగ్గేదేలే !

స్త్రీ శక్తి పథకంలో మహిళా ప్రయాణికుల జోష్

నెల రోజుల్లో 23 లక్షల మంది ఉచిత ప్రయాణం

జిల్లాలో రూ.7.27 కోట్ల మేర లబ్ధి

భీమవరం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకాన్ని పశ్చిమలోని మహిళలు ఉత్సాహంగా వినియోగించుకుంటున్నారు. గత నెల 15వ తేదీన జిల్లాలో 225 బస్సులతో మహిళలకు ఉచిత ప్రయాణం పథకం ప్రారంభించారు. ఈనెల 15వ తేదీ నాటికి జిల్లాలో 23 లక్షల మంది మహిళలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. ఉచిత ప్రయాణం ద్వారా ఇప్పటి వరకు మహిళలు రూ.7 కోట్ల 27 లక్షల లబ్ధి పొందారు. గత నెల 16 రోజుల్లో 11 లక్షల 1 వెయ్యి, 654 మంది ప్రయాణించగా రూ.3 కోట్ల 49 లక్షల 82 వేల 307 రూపాయలు ఆదా చేసుకున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి 14 వరకు 12 లక్షల 06 వేల 273 మంది ప్రయాణించగా రూ.3,75,55,367 రూపాయలు ఆదా చేసుకున్నారు. జిల్లా మొత్తం మీద ఆక్యుపెన్సీ రేషియో 79 శాతంగా ఉంది. గతంలో ఈ నెలల్లో 59 శాతం ఓఆర్ ఉంటే అది 25 శాతం పెరిగింది. ప్రతీ బస్సులో 80 శాతం పైగా ఓఆర్ ఉంటోందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఈ 14 రోజులకు సంబంధించి జిల్లాలో అత్యధికంగా తణుకు డిపోలో 72.44 శాతం మంది ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకున్నారు. 3 లక్షల 22 వేల మంది ప్రయాణించారు. వీటి ద్వారా కోటి 07 లక్షల ఆదాయాన్ని లబ్ధి పొందారు. భీమవరం డిపోకు సంబంధించి 65.22 శాతం ఉండగా 2 లక్షల 87 వేల మంది ప్రయాణించగా 88 లక్షల 90 వేలు ఆదాయం పొందారు. నరసాపురం డిపోకు సబంధించి 72.17 శాతం ఉండగా 2 లక్షల 84 వేలమంది ఉపయోగించుకోగా 95 లక్షలు ఆదాయం లబ్ధి పొందారు. తాడేపల్లిగూడెం డిపోకు సంబంధించి 71.76 శాతం ఉండగా 3 లక్షల 12 వేల మంది వినియోగించుకోగా రూ.63 లక్షల 64 వేలు లబ్ధి పొందారు.

బస్టాండ్లలోనే ఫుల్

మహిళా ప్రయాణికులకు సంబంధించిన సొమ్ము రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క పశ్చిమకు దాదాపు రూ.7 కోట్ల 70 లక్షలకు వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటి వరకు 8 ఫిర్యాదుల మాత్రమే అందాయి.అవికూడా చిన్న చిన్న సమస్యలకు సంబంధించి ఉండటంతో వాటిని తక్షణ పరిష్కారంచేసామని చెబుతున్నారు. ఆర్టీసీ బస్సులు బస్ కాంప్లెక్స్‌లోనే ఫుల్ అయిపోతున్నాయి. బయలు దేరిన తరువాత మార్గంలో మిగతా చోట్ల ఆపడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయం ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో ఆ సమస్యను పరిష్కరించే దిశగా ఆలోచన చేస్తున్నారు.

ఈనెల 1వ తేదీ నుంచి 14 వరకు మహిళల ప్రయాణ వివరాలు

తేది	ప్రయాణికులు	ఆదాయం	ఆక్యుపెన్సీ శాతం
1-9-2025	87,845	27,67,400	68.34
2-9-2025	77,176	22,73,536	68.85
3-9-2025	96,075	29,29,285	71.22
4-9-2025	91,263	28,06,498	70.61
5-9-2025	81,488	24,59,957	70.09
6-9-2025	86,232	29,91,901	76.08
7-9-2025	67,959	20,89,415	67.93
8-9-2025	80,115	23,53,735	68.51
9-9-2025	81,033	23,76,349	70.30
10-9-2025	97,113	29,06,225	71.79
11-9-2025	95,477	28,50,682	72.84
12-9-2025	79,714	23,74,948	69.26
13-9-2025	1,02,935	36,39,070	70.90
14-9-2025	81,848	27,36,366	68.95



ప్రత్యేక మోనటరింగ్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పెట్టిన మహిళలకు ఉచిత ప్రయాణం పథకంలో జిల్లాలోని నాలుగు డిపోల్లో పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ప్రత్యేక మోనటరింగ్ ఏర్పాటు చేశాం. బస్ కాంప్లెక్స్‌లో ప్రత్యేక సిబ్బందిని నియమించాం. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా దగ్గర ఉండి పంపించేలా చర్యలు చేపట్టాం. మరుగుదొడ్ల పరిశుభ్రత, మంచినీరు, సమాచార వ్యవస్థ ఏర్పాటు చేశాం.

వర ప్రసాదరావు, ప్రజా రవాణాధికారి

చేలను ముంచిన ఎర్రకాలువ



మారంపల్లిలో వరి పొలాలను ముంచిన వరద నీరు

తాడేపల్లిగూడెం రూరల్/ గణపవరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రకాలువకు వరదనీరు భారీగా రావడంతో తాడేపల్లిగూడెం మండలంలో వరదనీరు వరిచేలను ముంచింది. మండలంలోని మాదవరం, జగన్నాధపురం, మారంపల్లి, నందమూరు తదితర గ్రామాల్లో పొట్టదశకు చేరిన వరిపొలాలు మునిగాయి. దీంతో త్వరలో కోతలకు అందొచ్చే వరిపంట ఈ వరదలకు దెబ్బతింటుందా అనే ఆందోళనలో రైతులు ఉన్నారు. అయితే ఎగువన వరదనీరు తగ్గుముఖం పట్టడంతో వరదనీరు కిందకు వదలడం తగ్గిస్తున్నట్టు ఏఈ అనిల్ తెలిపారు.

పొంగి పొర్లుతున్న యనమదుర్రు

ఎర్రకాల్వ వరద ప్రభావంతో యనమదుర్రు వరద పోటెత్తుతోంది. గణపవరం మండలంలోని ఎస్.కొందేపాడు వద్ద లోలెవెల్ వంతెనను వరదనీరు తాకుతోంది. వరద మరింత పెరిగితే రాక పోకలు నిలిచే అవకాశాలున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిప్పర వద్ద యనమదుర్రు వరద 8.5 అడుగులు ఉందని ఇరిగేషన్ ఏఈ అనిల్‌తేజ తెలిపారు. ఇటీవల వర్షాలకు యనమదుర్రు పరివాహక గ్రామాల ఆయకట్టు వరిచేలు దెబ్బతిన్నాయి. తిరిగి నాట్లు కూడా వేసుకున్న పరిస్థితుల్లో యనముదుర్రు వరద పెరిగితే మరలా ముంపు బారిన పడక తప్పదని రైతులు భయపడుతున్నారు.



ఎస్.కొందేపాడు వద్ద లోలెవిల్ వంతెనను తాకుతున్న యనమదుర్రు వరద

భయపెడుతున్న గోదావరి

భద్రాచలం వద్ద 42 అడుగులకు పెరిగే అవకాశం

వేలేరుపాడు/కుక్కునూరు/పోలవరం,సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గోదావరికి మళ్లీ వరద పోటెత్తుతోంది. తెలంగాణలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరద పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి భద్రాచలం వద్ద 39.7 అడుగులు నీటిమట్టం నమోదు కాగా ఇది 42 అడుగుల వరకు పెరగవచ్చని సీడబ్ల్యూసీ అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం గోదావరికి వస్తున్న వరద, పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతో మండలంలోని కోయిదా దాని పరిసర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు, రహదారుల పైకి వరద వచ్చి చేరింది. ఎద్దువాగు వంతెన, టేకూరు వాగు వంతెన నీట మునిగాయి. దాదాపు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు మండలం గోదావరి తీర ప్రాంతంలో ప్రస్తుతం మిర్చి వేయాల్సిన సమయం కాగా వరద భయంతో మిర్చి సాగు ఆలస్యమయ్యే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. పోలవరంలో గోదావరి నీటిమట్టం సోమవారం అనూహ్య రీతిలో పెరిగింది. పట్టిసీమ శివక్షేత్రం వద్ద వరద జలాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.



సమావేశంలో మాట్లాడుతున్న పత్రిక సంపాదకులు సతీష్ చందర్

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైంది

తణుకు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని ప్రముఖ పత్రిక సంపాదకులు సతీష్ చందర్ అన్నారు. సామాజిక న్యాయపోరాట సమితి, తణుకు స్టడీ సర్కిల్, బ్లూమింగ్స్ ఫౌండేషన్ సంయుక్తంగా 'ఓటు రక్షకులే ఓటు భక్షకులా' అంశంపై ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. సతీష్ చందర్ మాట్లాడుతూ ఓటును రక్షించాల్సిన ప్రభుత్వ నేతలు భక్షకులుగా మారితే ప్రజాస్వామ్యం మనజాలదన్నారు. ఓటర్‌ను నేను బతికే ఉన్నానని నిరూపించుకో అనే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్యం కూలిపోయి నియంతృత్వ పోకడకడలు వస్తాయని బాబాసాహెబ్ అంబేడ్కర్ 1919లోనే పేర్కొన్నారన్నారు. మన ఓటు మనం రక్షించుకోవడమే పెద్ద పనిగా ఏర్పడిందని, మనం బతికే ఉన్నామని నిరూపించుకోవాల్సిన పరిస్థితులు ప్రభుత్వాలు కల్పించడం దురదృష్టకరమని చెప్పారు. ఎన్నికల కమిషన్ స్వయంప్రతిపత్తి గల వ్యవస్థ అని నిరూపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక న్యాయపోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పేరేరి మురళీకుమార్, గౌరవాధ్యక్షుడు గొల్లపల్లి అంబేడ్కర్, దారి దీపం సంపాదకులు డీవీవీఎస్.వర్మ, తణుకు స్టడీ సర్కిల్ డాక్టర్ బి.రమేష్‌చంద్రబాబు, సంకు మనోరమ, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

రేపు చిట్టూరి ఇంద్రయ్య కాలేజిలో ఉద్యోగ మేళా

తణుకు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చిట్టూరి ఇంద్రయ్య డిగ్రీ కాలేజి లో ఈనెల 17న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు సోమవారం తెలిపారు. స్టేట్ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్, నేషనల్ కెరీర్ సర్వీస్ సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగ మేళాలో హెటిరో ఫార్మా, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, రాయల్ ఇన్‌ఫీల్డ్ వంటి పలు కంపెనీలు పాల్గొంటాయన్నారు. 16 నుంచి 45 ఏళ్ల లోపు, పది నుంచి డిగ్రీ, డిప్లమో అర్హత ఉన్న అభ్యర్థులు పాల్గొనవచ్చన్నారు. ఉద్యోగం బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.30 వేల జీతం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాల కోసం 9618560188, 9440838388 నెంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.



పశ్చిమ గోదావరి జిల్లా అథ్లెటిక్స్ జట్లకు ఎంపికైన విద్యార్థులు

జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

తణుకు రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అండర్ 14, 16, 18, 20 విభాగాలలో అథ్లెటిక్స్ జట్లకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంకు సూర్యనారాయణ తెలిపారు. తణుకులో సోమవారం ఎంపిక పోటీల్లో జట్లు ఎంపిక చేశామన్నారు. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరు కాగా వారిలో 42 మంది వివిధ జట్లకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 27, 28, 29 తేదీలలో ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.సత్యనారాయణ, చైర్మన్ మానేపల్లి శ్రీనివాస్, కోశాధికారి కె.బాబూరావు, హెచ్ఎం పద్మావతి, వ్యాయామ ఉపాధ్యాయలు ఎస్.సత్యనారాయణ, కె.సుబ్బారావు, వి.అనంతలక్ష్మి, పి.ధైవజ్యోతి, ఎం.నాగరాజ్యం, ఎం.విజయదుర్గ, కె.అనిల్, బి.భాస్కర్, ఆర్.రవి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అల్లూరి సీతారామరాజు స్టేడియంలో అథ్లెటిక్ జిల్లా జట్లు ఎంపిక నిర్వహించారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 250 మంది హాజరయ్యారని, ప్రతిభ కనపరచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దేవరపలి ప్రసాద్ తెలిపారు. అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఆదిరెడ్డి సత్యనారాయణ, అధ్యక్షులు గుళ్లా ప్రసాదరావు, జిల్లా వీరభద్రరావు ఎంపిక పోటీలను పర్యవేక్షించారు.

కరాటేలో గోల్డ్‌మెడల్ సాధించిన హనీ



పతకం సాధించిన గుర్రం హనీ

టి.నరసాపురం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో 7వ తరగతి విద్యార్థిని గుర్రం హనీ గోల్డ్‌మెడల్ సాధించినట్లు ఆమె తండ్రి గుర్రం నాగరాజు సోమవారం తెలిపారు. పుట్రేపు గ్రామానికి చెందిన గుర్రం నాగరాజు, భారతి దంపతుల కుమార్తె హని సుమన్ రాజు పర్యవేక్షణలో కరాటే శిక్షణ పొందింది. ఈ నెల 14న అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి 5వ ఇంటర్‌స్టేట్ ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో ఉత్తమ ప్రతిభకనపరిచిన హనీ బంగారుపతకం సాధించింది. ఆమెను పాఠశాల హెచ్ఎం సిస్టర్ సోఫియా, కరస్పాండెంట్ సిస్టర్ దినియా, సిబ్బంది, పుట్రేపు గ్రామపెద్దలు అభినందించారు. చిన్నతనంలోనే కరాటేలో బంగారు పతకం సాధించటం ఆనందంగా ఉందని కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

నాడు మెడికల్ కాలేజీల పేరుతో నిధులు పక్కదారి

» మాజీ మంత్రి పీతల సుజాత

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల పేరుతో వైసీపీ కొత్త నాటకాలకు తెరతీసిందని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 17 వైద్య కళాశాలల గురించి జగన్ రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నారని, కానీ మెడికల్ కాలేజీల పేరుతో అప్పులు చేసి ఆ నిధులను పక్కదారి పట్టించిన విషయాన్ని ఎందుకు దాస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఆ విషయాన్ని కూడా ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

పంట కాల్వ కాదు.. మురుగు డ్రెయిన్!

ఆకివీడు శలకోడు దుస్థితి



చెత్తా, చెదారంతో మురుగు డ్రెయిన్‌ను తలపిస్తున్న శలకోడు



తూడు, గుర్రపుడెక్కతో పూడుకుపోయిన పంట కాల్వ

ఆకివీడు సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చేలకు సాగు నీరందించే శలకోడు మురుగు డ్రెయిన్‌ను తలపిస్తోంది. వెంకయ్య వయ్యేరు నుంచి ప్యాటిక్‌నగర్, గుమ్ములూరు సెంటర్ మీదుగా సాయిదుర్గ నగర్, గాంధీ నగర్ ప్రాంతంలో చేలకు శలకోడు ద్వారా సాగు నీరందుతుంది. మూడు దశాబ్దాలుగా సాయిదుర్గనగర్, గాంధీనగర్‌లో ఇళ్లు, ఇతర నిర్మాణాలతో పంట కాల్వ ఆక్రమణలతో పూడుకుపోయింది. నీటి పారుదల లేకపోవడంతో తూడు, గుర్రపుడెక్క, నాచు పేరుకుపోయింది. ఇళ్లలో మురుగు, చెత్త కాల్వలో చేరడంతో మురుగు డ్రెయిన్‌గా మారిపోయింది. అపారిశుధ్యం, దోమలతో స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. పలుమార్లు పాలకులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానిక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు మురుగు నీటి రోడ్డు నీట మునుగుతోంది.

ప్రోబ్లమ్ జోన్



బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిపై గోతులు

రోడ్డంతా గోతులే..!

బుట్టాయగూడెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఈ మార్గంలో వెళితే రోడ్డు కనిపించదు.. రోడ్డంతా గోతులే..! బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారి అడుగడుగునా గోతులతో ప్రమాదభరితంగా మారింది. ఏజెన్సీ ప్రజలకు ముఖద్వారంగా పిలువబడే ప్రధాన రహదారిలో రోడ్డు పూర్తిగా గుంతలు పడడం నరక మార్గమని వాహనదారులు వాపోతున్నారు. రెండు గ్రామాల మధ్య సుమారు ఏడు కిలో మీటర్లు వరకు రోడ్డు అధ్వానంగా కావడంతో కొత్తగా రోడ్డు నిర్మించడానికి యంత్రాలతో తవ్వేశారు. కానీ క్వారీ రజనుతో సరిపెట్టడంతో వర్షాల ధాటికి ఇలా గోతులతో దర్శనమిస్తోంది. మరో మార్గం లేక ఇదే రోడ్డుపై ప్రయాణాలు చేస్తూ ప్రమాదాల బారినపడి ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. మరోవైపు వాహనాలు సైతం మరమ్మతులకు గురవుతున్నాయి. ఏజెన్సీకి వచ్చే అధికారులు రోడ్డు దుస్థితి గమనించి ఏలూరు నుంచి నల్లజర్ల-కొయ్యలగూడెం మీదుగా బుట్టాయగూడెం, ఏజెన్సీ గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు, పాలకులు ఎప్పుడు స్పందిస్తారో..?



గోతులతో అధ్వానంగా మారిన బోడపాడు రహదారి

పెంటపాడు-బోడపాడు దారేది!

పెంటపాడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెంటపాడు - బోడపాడు రహదారి గోతులతో అధ్వానంగా తయారైంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఈ రహదారి వైపు కన్నెత్తి చూడలేదు. రహదారి మొత్తం గోతులతో రాకపోకలు సాగించలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బోడపాడు గ్రామస్తులు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. రహదారిపై ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని మరమ్మతులు చేయించాలని కోరారు. ఎమ్మెల్యే చొరవతో రహదారి మరమ్మతుల నిమిత్తం రూ.25 లక్షలు కేటాయించారు. కిలోమీటరు మేర రహదారి మెరుగుపరిచినా ఇంకా 3 కిలో మీటర్ల రహదారి గోతులతో అధ్వానంగా ఉంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన నిధులు ఇంకా మంజూరు కాలేదు. రహదారిపై ప్రయాణం మహిళలకు మరింత ఇబ్బందికరంగా మారింది. వాహనదారులు తరచు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఆచంట - వేమవరం రోడ్డులో కోనపోతుగుంట వద్ద కమ్మేసిన మొక్కలు

రోడ్డును మూసేసిన పిచ్చి మొక్కలు

ఆచంట, సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): రహదారి పక్కన పచ్చని చెట్లు ఉంటే ప్రయాణం ఆహ్లాదకరంగా సాగుతుంది. రోడ్డు మార్జిన్ మూసివేసినట్లు పిచ్చి మొక్కలు కమ్మేస్తే ప్రయాణం ప్రమాదకరం. కొన్ని రోజులగా వర్షాల జోరుతో రోడ్డు పక్కన ఉన్న పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. పంచాయతీ, సంబంధిత శాఖ పట్టించుకోకపోవడంతో పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోయి మార్జిన్ లేకుండాపోయింది. చిన్నపాటి మలుపులో సైతం ఎదురు వాహనం కనిపించని పరిస్థితి. ఎదురుదెరుగా రెండు వాహనాలు తప్పుకోలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆచంట నుంచి వేమవరం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డులో కోనపోతుగుంట సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. రాత్రి వేళ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలో పలు ప్రధాన రహదారుల పక్కన కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ఉపాధి హామీ కూలీల ద్వారా పిచ్చిమొక్కలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



సంవత్సరాల తరబడి ఇబ్బంది పడుతున్నాం

పెంటపాడు - బోడపాడు రహదారి అస్సలు బాగోలేదు. సంవత్సరాల తరబడి ఈ రహదారిపై ప్రయాణాలు చేయలేక ఇబ్బందులు పడుతున్నాం. కనీసం మరమ్మతులు కూడా జరగడం లేదు. మొత్తం రహదారి అంతా గోతులుగా మారిపోయింది. చాలా మంది పడిపోతున్నారు. రహదారి నిర్మించి మా కష్టాలు తీర్చాలని కోరుతున్నాం.

- తుమ్మగంటి సాయిరాం, రైతు, బోడపాడు

రాత్రి వేళల్లో ప్రయాణం భయం.. భయం..

కిరాణా వ్యాపారం చేస్తూ ఉంటాను. సరుకుల కోసం రోజుకు రెండు, మూడుసార్లు తాడేపల్లిగూడెం వెళ్లాల్సి ఉంటుంది. రహదారి మొత్తం గోతులు పడి ప్రయాణం చాలా ఇబ్బందిగా ఉంటుంది. రాత్రివేళలో ప్రయాణం చేయడానికి భయపడుతున్నాం. మహిళల పరిస్థితి మరింత దయనీయం. రహదారి నిర్మిస్తే తప్ప మా కష్టాలు తీరవు.

- బాదం వీరరాఘవరావు, వ్యాపారి, బోడపాడు



అరచేతిలో సస్య రక్షణ

» సెల్‌ఫోన్‌లో ప్రత్యేక యాప్, క్యూర్ కోడ్
» తెగుళ్ల గుర్తింపు.. నివారణ సూచనలు
» మార్టేరు వరి పరిశోధన స్థానంలో వ్యవసాయాధికారులకు శిక్షణ





ప్రస్తుత సాంకేతిక యుగంలో సెల్‌ఫోన్ అత్యవసర పరికరంగా మారింది. ప్రపంచాన్ని అరచేతిలో పట్టి చూపుతుంది. అరక్షణంలో ఆర్థిక లావాదేవీలు చేయొచ్చు. కాలు కదపకుండా కావలసిన సరుకు కాళ్ల దగ్గరకు తెచ్చుకోవచ్చు. సెల్‌ఫోన్ ద్వారా చక్కబెట్టే పనులు చెప్పాలంటే సమయం సరిపోదు. సెల్‌ఫోన్ వ్యవసాయ సాగులో కూడా కీలకం కానుంది. ప్రత్యేక యాప్‌లు, క్యూర్ కోడ్ ద్వారా చేలకు ఆశించిన తెగళ్లు గుర్తించవచ్చు.. నివారణ చర్యలు కూడా తెలుసుకోవచ్చు. దీనిని రైతుల వద్దకు చేర్చడానికి మార్టేరు వరి పరిశోధన స్థానంలో వ్యవసాయాధికారులు, రైతులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

పెనుమంట్ర, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఆధునిక డిజిటల్ టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో సాగు పద్ధతులు కూడా మారనున్నాయి. పంటల్లో తెగుళ్లు, క్రిమి కీట కాలు గుర్తింపు, సస్య రక్షణ సెల్‌ఫోన్ ద్వారా చేపట్టవచ్చు. ఫోన్‌లో ప్రత్యేక యాప్ లేదా క్యూ ఆర్ కోడ్ ద్వారా రైతులకు సమాచారాన్ని అందించేందుకు కాబి ఇంటర్నేషనల్ సంస్థ 'ప్లాంట్ వైజ్ ప్లస్ యాప్' రూపొందించారు. కాబి ఇంటర్నేషనల్ సంస్థ రూపొందించిన ఈ వివరాలపై మార్టేరు వరి పరిశోధన స్థానంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, రైతులకు రెండు రోజులపాటు శిక్షణ ఇచ్చారు. కాబి ప్లాంట్ వైస్ ప్లస్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే సుస్థిర వ్యవసాయ పంట ఉత్పత్తులు ప్రత్యక్షమవుతాయి. పంటలకు వచ్చే తెగుళ్లను సకాలంలో గుర్తించి నివారణ చర్యలు చేపట్టవచ్చు. వ్యవసాయ సాగులో నష్టాల నివారణకు పలు దేశాల్లో కాబి ప్లాంట్ వైస్ ప్లస్ యాప్ సహాయపడుతోంది.

చిన్న సన్న కారు రైతులకు ఎక్కువ ఉత్పత్తి, నాణ్యత మెరుగుపరచడంలో తోడ్పడుతుంది. రైతుకు సరైన సలహాలు ఇవ్వడం, తగు నిర్ణయాలు తీసుకోవడంలో కాబి ప్లాంట్ వైస్ ప్లస్ టూల్కిట్ డిజిటల్ సాధన ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇవి పంటల ఆరోగ్యం, సంరక్షణ గురించి తెలిపే వెబ్‌సైట్ మొబైల్ యాప్, ఆన్‌లైన్‌లో శిక్షణ కోర్సు లను సులభంగా ఉండేందుకు సహాయపడుతుంది.

కాబి జీవ భద్రతా పోర్టల్

బయో ప్రొటెక్షన్ పోర్టల్ ఓపెన్ ఆక్సెస్ సాధన ప్రపంచవ్యాప్తంగా నమోదు చేయబడిన జీవ నియంత్రణ, జీవకీటక నాశిని సమాచారం అందిస్తుంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో లభిస్తుంది. ఈ యాప్ వ్యవసాయ సలహాదారులకు, రైతులకు తన పంటలో కలిగే సమస్యాత్మక తెగుళ్లను, నియంత్రించడానికి కావలసిన జీవ నియంత్రణ, జీవ తెగుళ్ల నాశినులను గుర్తించి కొనుగోలు చేయడానికి, సక్రమంగా వాడటానికి సహాయపడుతుంది.

నాలెడ్జ్ బ్యాంక్

నాలెడ్జ్ బ్యాంకులో15 వేలకు పైగా వివిధ పంటలు తెగుళ్ల నిర్వహణను తెలిపే వాస్తవ పత్రాలు ఫ్లాడ్ షీట్స్ గైడ్స్ వీడియోలు, పురుగు తెగుళ్ల గుర్తించే సాధనాలు, పలు దేశాలకు సంబంధించి కీటక, తెగుళ్ల నాశిని జాబితా, వ్యాధి నిర్ధారణ పద్ధతులు ఉన్నాయి.

కాబి అకాడమీ శిక్షణ తరగతులు ధ్రువీకరణ పత్రాలు రైతుల సలహాల నైపుణ్యాలు, పెంచడంలో తోడ్పడతాయి. రైతులకు సరైన సలహాలను ఇవ్వడం ద్వారా పంటల దిగుబడి పెంచడంలో వీరు ఎంతో తోడ్పడుతారు. అనువైన ఇంటరాక్టర్ కోర్సుల యాప్‌ల ద్వారా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా లభిస్తాయి.



పిచికారీ యాప్

క్రాప్ స్ప్రేయర్ వినియోగించడానికి సులభమైన, ఉచిత ఆండ్రాయిడ్ యాప్ పంటలపై మందు పిచికారీ, ఎంత కీటక నాశినిని వినియోగించాలో లెక్కించడంలో సహాయపడుతుంది. యాప్‌లో వివిధ సూత్రీకరణలు, కీటక నాశిలను సరైన మోతాదులో వాడటంలో సహాయపడుతుంది. డబ్బు ఆదా చేయడం, అధిక మోతాదులో వాడడం వల్ల కలిగే హానిని అరికట్టడంలో సహాయపడుతుందని కాబి ఇంటర్నేషనల్ నిర్వాహకులు శాస్త్రవేత్తలకు వ్యవసాయ అధికారులకు రైతులకు తెలియపరిచారు. ఇది క్షేత్ర స్థాయిలో ఎరువులు, పురుగుమందులు వినియోగం తగ్గి రైతుకు పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుందని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

పురుగుల మందుతో జాగ్రత్త

అత్తిలి/లింగపాలెం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం అంటేనే కష్టనష్టాలతో కూడుకున్న పని. ప్రకృతిలో మార్పులు చోటుచేసుకుంటే ఆరుగాలం పండించిన పంట చేతికొస్తుందో రాదోననే భయం అన్నదాతలను వేధిస్తుంది. ఉమ్మడి జిల్లాలో లక్షల ఎకరాలలో వరి, మొక్కజొన్న, పత్తి, మినుము, పెసర, పలురకాల ఉద్యాన, వాణిజ్య పంటలు సాగుచేస్తున్నారు. తెగుళ్ల నుంచి పంట రక్షించుకునే క్రమంలో పురుగు మందుల పిచికారీ సమయంలో రైతులు అనారోగ్యాల పాలవుతున్నారు. పురుగు మందులు అసలు, నకిలీ తెలుసుకునేందుకు మూత తీసి వాసన చూస్తుంటారు. పురుగు మందుల ఘాటుకు కడుపులో వికారం, వళ్లంతా దద్దుర్లు రావడం, ఊపిరితిత్తులు, కళ్లు, గొంతు సమస్యలు తలెత్తుతాయి. శరీర అవయవాల పని తీరు మందగించడం, కంటిచూపు తగ్గడం, ఊపిరి తిత్తులు పాడవడం వంటి అనారోగ్యకారణాలు చోటుచేసుకుంటాయని వైద్య నిపుణులు, వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

వీటిని పాటించాలి

- పిచికారి చేసే సమయంలో రైతులు ముక్కు, నోటికి మాస్క్, చేతులకు గ్లౌజులు ధరించాలి.
- తలకు రక్షణగా టోపీ పెట్టుకోవాలి.
- శరీరం మొత్తం కప్పిఉంచే ఆప్రాన్ ధరించాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో గాలి వాలుగానే పిచికారి చేయాలి.
- అనారోగ్య సమస్యలు వస్తే వైద్య సేవలు పొందాలి.
- పురుగు మందు నేరుగా ట్యాంకులో కలపకూడదు. విడివిడిగా వేరే ప్రాంతాల్లో కలుపుకొని మిశ్రమాన్ని ట్యాంకులో పోసుకోవాలి.
- పురుగు మందు, తెగుళ్ల మందు రెండింటిని కలిపి పిచికారి చేయవద్దు, విడివిడిగా కలుపుకోవాలి.
- కలుపు నాశని మందును పిచికారి చేశాక ట్యాంకు శుభ్రంగా కడగాలి.
- పురుగు మందు విరిగిపోతే దాన్ని పిచికారి చేయకూడదు.
- పిచికారి సమయంలో ధూమపానం, మద్యపానం చేయకూడదు. పాన్‌పరాగ్, గుట్కాలు నమలకూడదు. వీటి ద్వారా పురుగు మందు అవశేషాలు నోటి ద్వారా ఊపిరితిత్తులకు చేరతాయి.

సేంద్రియ సాగు పద్ధతులు ఆచరించాలి



పురుగుమందులలో అధిక గాఢత వలన చర్మ సంబంధిత సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు వస్తున్నాయి. మెదడుపై కూడా ప్రభావం చూపుతాయి. పురుగుమందుల పిచికారీ తర్వాత కళ్లు తిరగడం, వాంతులు, విరోచనాలు, కళ్లమంట వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ విధానంతో క్రిమిసంహారక పురుగుమందులు లేకుండానే తెగుళ్లను నివారించవచ్చు.

- వి.ప్రదీప్‌కుమార్, ఏవో, లింగపాలెం



కుంకుళ్లమ్మకు శరన్నవరాత్రి శోభ

» 22 నుంచి ఉత్సవాలు » ముస్తాబవుతున్న అమ్మవారి ఆలయం



ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి క్షేత్రదేవత కుంకుళ్లమ్మ ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల 2 వరకూ జరుగనున్న ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ పరిసరాలను రంగులు, విద్యుత్ దీప తోరణాలతో అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు

అమ్మవారు ఈనెల 22న బాలాత్రిపురసుందరి, 23న గాయత్రిదేవి, 24న అన్నపూర్ణా, 25న కాత్యాయినీ, 26న మహలక్ష్మీ, 27న లలితా త్రిపురసుందరి, 28న మహాచండిగా దర్శనమిస్తారు. 29న మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని మహాసరస్వతి, 30న దుర్గాదేవిగా అనుగ్రహించనున్నారు. వచ్చేనెల 1న మహిషాసురమర్దని, 2న రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తారన్నారు. అదేరోజున సాయంత్రం శ్రీవారి క్షేత్రంలో అమ్మవారి రథోత్సవం, 3న ఉదయం 7గంటలకు ఇరుముడుల సమర్పణ, చండీహోమాన్ని నిర్వహిస్తారు. 4న ఆలయం వద్ద ఉదయం 11 గంటలకు భారీ అన్నసమారాధన జరుగుతుందని భక్తులు తరలిరావాలని ఈవో కోరారు.

ద్వారకాతిరుమలలో శ్రీకృష్ణాష్టమి వేడుక



సప్తగోకులంలో శ్రీకృష్ణుడికి హారతులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు చినవెంకన్న క్షేత్రంలో సోమవారం నేత్రపర్వంగా జరిగాయి. ఉదయం గోసంరక్షణశాలలో పలువురు గోవులకు పూజలు చేశారు. సప్తగోకులంలో శ్రీకృష్ణుని పలువురు దర్శించుకున్నారు. ఆలయంలో కృష్ణుని విగ్రహానికి అర్చకులు, పంచామృత అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 12 రకాల సేవా కాలాలను నిర్వహించి దాంతో పాటు 12 రకాల పిండి వంటలను నైవేద్యంగా చిన్నికృష్ణునికి సమర్పించారు. ఆలయంలో సోమవారం అన్ని రకాల ఆర్జిత సేవలు రద్దు అయ్యాయి. మంగళవారం యధావిధిగా ప్రారంభమవుతాయని ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు.

నేడు ఉట్టి పండుగ

శ్రీకృష్ణ జన్మాష్టమి మరుసటి రోజైన మంగళవారం సాయంత్రం క్షేత్రంలో ఉట్టి పండుగ జరుగుతుందని ఆలయ ఈవో మూర్తి తెలిపారు. ఉభయదేవేరులతో శ్రీవారు తిరువీధుల్లో ఊరేగుతారని భక్తులు ఈ వేడుకలో పాల్గొనాలని ఆయన కోరారు.

డంపింగ్ యార్డు వద్దంటూ ధర్నా


ధర్నా చేస్తున్న డంపింగ్ యార్డు బాధితులు

నరసాపురం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య డంపింగ్ యార్డు ఏర్పాటు చేయవద్దంటూ సోమవారం పట్టణంలోని 28వ వార్డు ప్రజలు ధర్నాకు దిగారు. ముందుగా సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఆర్డీవో దాసిరాజుకు వినతిపత్రం ఇచ్చారు. అక్కడ నుంచి మునిసిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన చేసి, కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తున్న స్థల సమీపంలో లేఅవుట్లు అత్యధిక సంఖ్యలో నివాసిస్తున్నారని అంటున్నారు. ఇక్కడ యార్డు ఏర్పాటు కాకుండా మరో స్థలంలో చూడాలని కోరారు. కమిషనర్ మాట్లాడుతూ కలెక్టర్‌తో చర్చించిన తరువాత తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

పంటు తనిఖీ


పంటును పరిశీలిస్తున్న ఎంపీడీవో వీరభద్రరావు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మాధవాయిపాలెం రేవును సోమవారం ఎంపీడీవో వీరభద్రరావు తనిఖీ చేశారు. పంటు నిర్వహణ, ఫిట్‌నెస్ పత్రాలు, డ్రైవర్ లైసెన్స్, లైఫ్ జాకెట్ల సంఖ్య, టిక్కెట్ల విక్రయ వ్యవహారం పరిశీలించారు. ఇటీవల నది ప్రవాహానికి పంటు ఒ పక్కకు ఒరిగినట్లు సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియోపై ఆరా తీశారు. ఇటువంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకూడదన్నారు. నిర్దేశించిన సంఖ్యలోనే ప్రయాణికుల్ని, వాహనాలను ఎక్కించాలన్నారు. ఇక నుంచి తరుచూ తనిఖీ చేస్తామని అన్నారు.

ఎల్ఆర్ఎస్‌లో కొన్ని మార్పులు చేయాలి

భీమవరం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనధికారిక లేఅవుట్లను రెగ్యులర్ చేసుకునేందుకు యజమానులకు ఉపయోగ పడే విధంగా జీవో ఇచ్చినా అందులో కొన్నిమార్పులు చేస్తే మరింత ప్రయోజన కరంగా ఉంటుందని వెల్ఫేర్ ఆఫ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్‌టీపీ) అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్తి రాంబాబు తెలిపారు. సోమవారం భీమవరంలో జరిగిన జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందులో ప్లాట్ దారుడు రెగ్యులర్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఆరోజు ఉండే ధర ఆధారంగా 14శాతం విధించటం వల్ల ఎంతో ఇబ్బందితో పాటు ఆర్థికంగా కూడా భారంగా మారుతుందని అన్నారు. దానిని గతంలో స్థల రిజిస్ట్రేషన్ చేసుకున్న రోజున ఉన్న ధర ఆధారంగా 10 శాతం కట్టేవిధంగా మార్పుచేస్తే ప్రయోజన కరంగా ఉంటుందని ఆయన అన్నారు. అపార్ట్‌మెంట్ నిర్మాణ విషయంలో అదనంగా మరో రెండు ఫ్లోర్లకు అనుమతి ఇవ్వటం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు.

వెల్ఫేర్ ఆఫ్ ఎల్‌టీపీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

భీమవరం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వెల్ఫేర్ ఆఫ్ ఎల్‌టీపీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక సోమవారం నిర్వహించారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా బీహెచ్ జానకి రామరాజు (భీమవరం), అధ్యక్షునిగా వి. శ్రీనివాసరావు(తణుకు), కార్యదర్శిగా కేవీ రమణ (భీమవరం) ఉపాధ్యక్షులుగా పెన్మెత్స శ్రీనివాసరావు (నరసాపురం), కె.సూర్యచంద్రరావు(తణుకు), జాయింట్ సెక్రటరీగా ఎల్.వెంకట్ (భీమవరం),కోశాధికారిగా విఎస్ఎన్ఆర్ మణికంఠ కుమార్(పాలకొల్లు), సభ్యులుగా ఎస్ఎల్ గణేష్(పేరుపాలెం), జి ఉమామహేష్(తణుకు), వి.సురేష్(నరసాపురం), టి ఉమామహేశ్వరరావు(భీమవరం), బండెల హనుమంతరావు(తాడేపల్లిగూడెం) ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ ఎల్‌టీపీ, ఇంజనీర్ ఎంవీ నరసింహారావును సత్కరించారు.

సార్వాలోను తప్పని సాగునీటి సమస్య

ఆచంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సార్వా సాగు అంటేనే తరచూ వర్షాలు పడటం వల్ల సాగునీటికి ఇబ్బందులు తలెత్తవు. అయితే కొన్ని చోట్ల సాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదు. ఆచంట, కోడమంచిలి రోడ్డు మధ్యలో కొడమంచిలికి చెందిన తాడేరు కాలువ సమీపంలో బోరు ద్వారా ఇంజన్ సహాయంతో పొలాలకు నీరు పెట్టుకునే పరిస్థితి నెలకొంది. తాడేరుకాలువ పక్కన ఆనుకుని ఉన్న పంట పొలాలకు సంబంధించి పంట బోదెల్లో నీరు లేకపోవడంతో సాగునీటి సమస్య ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):అనధికార లేఅవుట్లు క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఏలూరు అర్బన్‌డెవలప్‌మెంట్ ప్లానింగ్ అధికారి వి.సుధాకర్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం అక్రమ లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీంపై తాడేపల్లిగూడెం, తణుకు, పెంటపాడు, ఇరగవరం, అత్తిలి, గణపవరం మండల కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విసుధాకర్ మాట్లాడుతూ ఈ స్కీమ్ క్రమబద్ధీకరించుకోవడం వల్ల బ్యాంకులో రుణంతోపాటు ఆ స్థలం చట్టబద్ధమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో ఎం.వెంకటేష్, డిప్యూటీ ఎంపీడీవోలు ఎం. శ్రీనివాసరావు, వైటీఆర్‌వీ ప్రసాద్, వీపీఎస్ రాంప్రసాద్, టీపీఎస్ఎస్ మూర్తి, టీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

20న బీచ్ పరిశుభ్రతా కార్యక్రమం


పేరుపాలెం తీరాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో దాసిరాజు, అధికారులు

మొగల్తూరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సముద్ర తీర ప్రాంతాల పరిశుభ్రత కార్యక్రమా న్ని ఈనెల 20న నిర్వహించే ఏడుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నరసాపురం ఆర్డీవో దాసిరాజు తెలిపారు. సోమవారం జిల్లా టూరిజం, రెవెన్యూ శాఖ అధికారులతో పాటు మండలస్థాయి అధికారులతో పేరుపాలెం, కెపిపాలెం సాగరతీరాలను పరిశీలించారు. ఈనెల 20న సముద్రం మెండి అన్ని శాఖల అధికారులు, నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొని తీర ప్రాంతాన్ని పరిశుభ్రం చేసేందుకు అవసరమయ్యే ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాజ్ కిశోర్, ఎంపీడీవో (తిరుమలరావు, డీఎల్‌పీవో, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్ పాల్గొన్నారు.

రాహుల్‌దేవ్ శర్మకు ఎక్సైజ్ డైరెక్టర్ బాధ్యతలు

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ బాధ్యతలను ఆ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మకు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా పనిచేసిన నిషాంత్ కుమార్ ఇటీవల అనంతపురం జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయిన నేపథ్యంలో ఈ మేరకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

అమరావతి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యుత్తు సంస్థల్లో ఉన్న 23 సంఘాల ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. 22వ తేదీ వరకు వివిధ రూపాల్లో నిరసన తెలిపి, అప్పటికీ యాజమాన్యాలు స్పందించకుంటే 24న జేఏసీ సమావేశమై తదుపరి కార్యాచరణ ప్రకటిస్తుందని ఏపీఎస్ఈబీజేఏసీ ప్రకటించింది.

ఎన్నాళ్లో వేచిన ఉదయం

ఉమ్మడి పశ్చిమలో 1063 ఉపాధ్యాయ ఉద్యోగాలకు అభ్యర్థుల ఖరారు

- 534 మంది పురుషులు, 529 మంది మహిళలు.. అర్హులు లేని కారణంగా భర్తీ కాని 11 పోస్టులు
- దసరా సెలవుల్లో శిక్షణ, పోస్టింగ్‌లకు కౌన్సెలింగ్
- 19న వెలగపూడిలో సీఎం సమక్షంలో నియామక పత్రాలు


పెదవేగి మండలం కూచింపూడిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన భార్యకు మిఠాయి తినిపిస్తున్న భర్త చంద్రశేఖర్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ ఉద్యోగాలకు తుదిగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను విద్యా శాఖ సోమవారం విడుదల చేసింది. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, గిరిజన సంక్షేమ శాఖ, జువైనల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ల పాఠశాలలకు 1074 పోస్టులను నోటిఫై చేయగా, వీటిలో 1063 పోస్టులకు అర్హులైన అభ్యర్థులను మెరిట్ కం రిజర్వేషన్ రోస్టర్ నిబంధనల మేరకు ఖరారు చేస్తూ వారి పేర్లను వెలువరించారు. ఆయా కేటగిరీల(స్కూల్ అసిస్టెంట్/ఎస్జీటీ) నుంచి 11 పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేకపోవడంతో వాటిని భర్తీ చేయలేదు. వీటిని వచ్చే డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు ఉంచేశారు. ఇందులో ఎస్సీ ఉపకులాలకు రిజర్వ్ చేసిన 10 పోస్టులు, బీసీ(మహిళ) కేటగిరీలో ఒక పోస్టు ఉన్నాయి. ఎంపికైన 1063 మంది అభ్యర్థుల్లో 534 మంది పురుషులు, 529 మంది మహిళలున్నారు. వీరందరికీ దసరా సెలవుల్లో ఈ నెల 22 నుంచి 29 వరకు ఇండక్షన్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. శిక్షణ సమయంలోనే కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్ ఉత్తర్వులు జారీచేస్తారు.

15 రోజుల్లో చేరుకుంటే..

ఉమ్మడి పశ్చిమలో మండలాల వారీగా టీచర్ల కొరతవున్న పాఠశాలలను గుర్తించి, వెకెన్సీలను కౌన్సెలింగ్‌లో ప్రదర్శిస్తారు. ఆ మేరకు కేటగిరీ-4తో ప్రారంభించి కేటగిరీ-1 వరకు స్టేట్‌వైడ్ పోస్టులకు సమానంగా ప్రదర్శనకు పెట్టిన వెకెన్సీలకే అభ్యర్థులు ఆప్షన్ ఇవ్వాలి. శిక్షణ పూర్తయిన వెంటనే అభ్యర్థి తమకు కేటాయించిన పాఠశాలల్లో 15 రోజుల్లోగా చేరాలి. లేకుంటే ఆ పోస్టును తదుపరి డీఎస్సీకి చూపుతారు. మెయిటింగ్ లిస్టు ఉండదు. అప్పాయింట్ షిప్ ఉండదు. రెగ్యులర్ జీతభత్యాలు చెల్లిస్తారు. ప్రస్తుత విద్యాసంవత్సరం అకడమిక్ కేలండర్ ప్రకారం మిగిలి వున్న సిలబస్/సిలబస్ సిలబస్ నూతన ఉపాధ్యాయులకు వర్తిస్తాయి. ఎంపికైన అభ్యర్థులకు కుటుంబసభ్యులు మిఠాయిలు తినిపించి సంతోషాన్ని పంచుకున్నారు. కొందరైతే ఇష్టదైవాలకు పూజించారు. ఎన్నాళ్లకో తమ కల ఫలించిందని ఆనందం వ్యక్తం చేశారు.

ఏలూరులో వసతి.. పెద్ద సమస్యే!

ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న వెలగపూడిలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియామక పత్రాలు అందించేందుకు జిల్లా విద్యా శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఆ మేరకు ఎంపికైన అభ్యర్థితోపాటు ఒక సహాయకుడిని తీసుకువెళ్ళవచ్చు. ఈ లెక్కన 2,126 మందిని ఏలూరులోని తొమ్మిది పాఠశాలల్లో వసతి కల్పించేలా నిర్ణయించారు. వీరంతా తమకు కేటాయించిన పాఠశాలలకు ఈ నెల 18 సాయంత్రం నాలుగు గంటలకు చేరుకోవాలి. స్కూలు తరగతి గదులనే నిద్రించడానికి వీలుగా మలుస్తున్నారు. ఆ రోజు రాత్రి భోజనం, మరుసటి రోజు ఉదయం అల్పాహారం అనంతరం ఆర్టీసీ బస్సుల్లో వెలగపూడికి తరలిస్తారు. మార్గ మధ్యలో భోజనం చేయడానికి వీలుగా ఆహార ప్యాకెట్లను సిద్ధం చేసి బస్సుల్లో ఉంచుతారు. ఆ మేరకు ప్రతీ 24 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు, వారి వెంట వచ్చిన మరో 24 మంది సహాయకులను ఒక బస్సులో తరలించేలా నిర్ణయించి, వారికి భోజన, వసతి సౌకర్యాలు, రవాణా, తదితర విషయాలను సమకూర్చడం, పర్యవేక్షించడానికి అధికారుల నేతృత్వంలో మొత్తం 45 టీమ్‌లను నియమించారు. ప్రతీ బృందంలో ఒక ఎంఈవో పర్యవేక్షకునిగా, మరో నలుగురు వ్యాయామ విద్య ఉపాధ్యాయులు సూపర్‌వైజర్లుగా వ్యవహరిస్తారు. ఇంత వరకు ఏర్పాట్లు బాగానేవున్నా అభ్యర్థులు, వారి సహాయకులు 18న రాత్రి నిద్రించడానికి వీలుగా మంచాలు/పరుపులు/బ్లాంకెట్స్ సరి పడా సంఖ్యలో లేవు. ఏలూరు, సమీప ప్రాంతాల్లోని షామియానా సెంటర్లలో ఎంత గాలించినా 500 పరుపులు కూడా అందుబాటులో లేవు. మరోవైపు భోజనం, అల్పాహారం, తాగునీరు, తదితర ఖర్చులకు ప్రభుత్వం నుంచి సోమవారం సాయంత్రం వరకు బడ్జెట్ విడుదలపై సమాచారం అందకపోవడంతో ఖర్చులపై డైలమా నెలకొంది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల్లో గర్భిణులు, చిన్నపిల్లలున్న తల్లులు, దివ్యాంగులుంటే వసతి ఎలాగనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అభ్యర్థితోపాటు వందల సంఖ్యలో అభ్యర్థులు, వారి సహాయకులకు టాయిలెట్ల సమస్య ఏర్పడనుంది. రవాణా నిమిత్తం ఆర్టీసీ బస్సులను ప్రభుత్వం సమకూర్చింది. దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని విద్యా శాఖ వర్గాలు కోరుతున్నాయి.

విర్డ్‌లో ఆర్థో శస్త్ర చికిత్సలు విజయవంతం


ద్వారకాతిరుమల విర్డ్‌లో శస్త్ర చికిత్సలు లైవ్‌లో చూస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):విర్డ్ ఆసుపత్రిలో ఈ నెల 13, 14 తేదీల్లో 14 మందికి తుంటి, మోకాలుకు ఆర్థో శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. జాతీయస్థాయి ప్రముఖులైన 14 మంది ఫ్యాకల్టీలు, 150 మంది వైద్యులు పాల్గొన్నారు. మోకాలు, తుంటికి సంబంధించి ఇన్‌ఫెక్షన్, రివిజన్ శస్త్ర చికిత్సలను డాక్టర్ కృష్ణకిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆసుపత్రి చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు మాట్లాడుతూ ఇటువంటి శస్త్ర చికిత్సల వైద్యులు తమ విజ్ఞానాన్ని పెంచుకునేందుకు, వైద్యరంగం మెరుగు పర్చుకునేందుకు ఉపయోగపడతాయన్నారు. జాతీయ వైద్యులు రాజేష్ మల్హోత్రా, మహేష్ కులర్ణి, నరేంద్ర, రాజ్‌కుమార్, నటేశన్, సాయిలక్ష్మణ్ అన్నే, అనిల్ ఉమ్మేన్, బిపిన్ తెరుపల్, సమీర్ అలీ పర్వత, చంద్రశేఖర్, సునీల్ అప్పిరెడ్డి, సుమన్ పెండ్యాల, వినయ్ కిశోర్, ఆదిత్యకృష్ణ, రాంప్రసాద్ కంచెర్ల, రాజేష్‌కుమార్‌రెడ్డి, సుమిత్ భూషణ్‌శర్మ, పాల్గొన్నారు. ట్రస్టీలు, ఈవో మూర్తితోపాటు వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, రమ్య మహిత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన వర్సిటీ వీసీ ఎవరో ?

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వ విద్యాలయ ఉపకులపతి నియామకం పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇప్పటి వరకూ ఇన్‌చార్జ్ వీసీగా కొనసాగిన గోపాల్ ఆగస్టు నెలాఖరున ఉద్యోగ విరమణ చేయగా అప్పటి నుంచి ఆయన స్థానంలో ఎవరన్నది సందిగ్ధంలోనే ఉంది. ప్రస్తుత వీసీ గోపాల్‌ను వీసీగా కొనసాగిస్తారా ? విశ్వ విద్యాలయ పరిధిలో సీనియర్లకు అవకాశం ఇస్తారా? సాధారణ ఇన్‌చార్జ్ వీసీగా నియమిస్తారా ? అనేది తేలాల్సి ఉంది. ప్రస్తుతం వీసీ రేసులో సీనియారిటీ జాబితా ప్రకారం మహానంది హెచ్ఆర్ఎస్‌లో ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, వెంకట్రామన్నగూడెం డీన్ పరీక్షల నియంత్రణ అధికారి బి.ప్రసన్నకుమార్, విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు ఉన్నారు. ఇన్‌చార్జ్ వీసీ గోపాల్ తన ను కొనసాగించాలని ప్రభుత్వానికి రాసిన లేఖపై స్పష్టత లేదు.

13 మంది ఏఈలకు ఎంపీడీవోలుగా పదోన్నతి


ఎంపీడీవోగా నియామక పత్రాలు అందజేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు సిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిషత్ పరిధిలో పనిచేస్తున్న 13 మంది ఏఈలకు ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించారు. ఈ ఉత్తర్వులను జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే కారుణ్య నియామకాల తొలి ఫైల్‌పై సంతకం చేశానన్నారు. జడ్పీలో ఇప్పటి వరకు 87 మందికి పదోన్నతులు కల్పించాం. ఇందులో ఏఈలుగా 27 మందికి, సీనియర్ అసిస్టెంట్లుగా 31 మందికి, జూనియర్ అసిస్టెంట్లుగా ఆరుగురికి, రికార్డ్ /లైబ్రరీ/ల్యాబ్ అసిస్టెంట్లుగా 23 మంది ఉన్నారన్నారు. జడ్పీ సీఈవో ఎం.శ్రీహరి మాట్లాడుతూ పదోన్నతులు ఉద్యోగుల్లో ఉత్సాహాన్ని పెంచటమే కాక పనితీరును మెరుగుపరచుకోవటానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.


ఎంపికైన మహిళా కబడ్డీ జట్టు

కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):పశ్చిమ గోదావరి జిల్లా మహిళా, పురుషుల కబడ్డీ జట్లు తాడేపల్లిగూడెం వాసవి ఇంజినీరింగ్ కళాశాల వద్ద సోమవారం ఎంపికయ్యాయి. వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణ ఆధ్వర్యంలో 14 మంది పురుషులు, 14 మంది మహిళలను ఎంపిక చేశారు. వ్యాయామ క్రీడాకారులు కె.ప్రసన్నకుమార్, కల్లపల్లి శ్రీను, జక్రీకాంత్ ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24 నుంచి 28 మధ్యలో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా తరఫున పాల్గొంటారు.

పేద కమ్మ కుటుంబాలకు అండగా ఉంటాం

అమరావతి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):కమ్మ కులంలో పేద కుటుంబాలకు అండగా నిలవడమే కార్పొరేషన్ లక్ష్యమని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మం చౌదరి పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన నేతృత్వంలో డైరెక్టర్లు తొలిసారిగా సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కమ్మ కులంలో ఆర్థిక ఇబ్బందులు వల్ల ఒక్క విద్యార్థి కూడా చదువు ఆపకుండా చూడాల్సిన బాధ్యత కార్పొరేషన్‌పై ఉందన్నారు.

దేవస్థానం రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవస్థానంలో లీజెస్ విభాగంలో పనిచేస్తూ చేతివాటం ప్రదర్శించిన రికార్డు అసిస్టెంట్ సాయిని సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానం షాపుల పాటదారుడు నుంచి వసూలు చేసిన లీజు సొమ్ములో కొంత స్వాహా చేసి మిగిలిన సొమ్మును దేవస్థానానికి జమ చేసిన వ్యవహారంలో ఈవో విచారణ చేపట్టారు. అనంతరం సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నారు. గతనెలలో దేవస్థానం నిర్వహించిన వేలంపాటలో పాటదారుడు చెల్లించిన సొమ్ములో రూ.9 వేలు తగ్గించి ఎంటర్ రాయడంతో ఈ బాగోతం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. టీటీడీ కాంప్లెక్స్ షాప్‌నెంబరు 11కు సంబంధించి జరిగిన వేలంపాటలో సదరు రికార్డు అసిస్టెంట్ అనుమంచిపల్లి సాయిరామానుజన్ చేతివాటం ప్రదర్శించినట్లు అధికారులు ధ్రువీకరించారు. హెచ్చు పాటదారుడు సిద్ధయ్య ఆగస్టు 6న షాపు అద్దె సొమ్ము రూ.51 వేలను పాటదారుడు రికార్డు అసిస్టెంట్‌కు కట్టాడు. ఆ డబ్బుని తనకు అందిన సొమ్ము మొత్తానికి ఎంటర్ రాయకుండా రూ.9 వేలు తగ్గించి రూ.42వేలకు మాత్రమే ఎంటర్ రాశాడు. ఇది నిజమని తేలడంతో సస్పెండ్ చేశారు.

బాలుడి ఆచూకీ కోసం రెండో రోజు గాలింపు

పాలకొల్లు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేండ్ర అగ్రహారం శివారు కట్టవారిపాలెంలో ఆదివారం సాయంత్రం గోస్తని నదిలో పడి గల్లంతైన బాలుడి ఆచూకీ కోసం రెండవ రోజు సోమవారం కూడా గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం సాయంత్రం వరకు పాలకోడేరు మండల పోలీసులు, భీమవరం ఫైర్ సిబ్బందితో పాటు స్థానికులు రొయ్యల చెరువుల్లోని నాటుబోట్లను వేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన బాలుడు ఖాన్ బాల్ల ప్రవల జైదేవ్(7) ఆచూకీ లభ్యం కాకపోవడంతో అధికారులు ఎన్‌డీఆర్ఎఫ్ (జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ)కు చెందిన బృందం సభ్యులు కాకినాడ నుంచి రప్పించారు. చీకటిపడ్డాక ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యులు బాలుడి ఆచూకీ కోసం వెతుకులాట ప్రారంభించారు. బాలుడు గల్లంతైన ప్రదేశాన్ని తహసీల్దార్ భారతీ విజయలక్ష్మి, ఎస్ఐ రవివర్మ, పోలీసులు పరిశీలించారు.

వ్యభిచార గృహం నిర్వాహకుడి అరెస్టు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తూ వరకల్లో ఉన్న ప్రధాన నిందితుడిని ఏలూరు రూరల్ పోలీసులు సోమవారం రాత్రి అరెస్టు చేశారు. ఏలూరు రామచంద్రపురం వీధిలో నివాసముంటున్న కలపటపు శ్రీనివాస్‌కుమార్ ఏలూరు రూరల్ మండలం తంగెళ్లమూడి ప్రాంతం బీడీ కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఇతర ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 8న రూరల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ ఇంటిపై గతంలో దాడి చేశారు. అప్పట్లో ప్రధాన నిందితుడైన కలపటపు అశోక్ కుమార్ పరారీ అయ్యాడు. మిగిలిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న అశోక్ కుమార్‌ను సోమవారం రాత్రి రామచంద్రాపురం వీధిలో పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కోర్టులో హాజరుపర్చనున్నారు.

పేకాట స్థావరాలపై పోలీసుల దాడి

ఉండి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహదేవపట్నంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో రూ.3800 నగదు స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అదుపులోని తీసుకున్నట్టు తెలిపారు. అలాగే పాందువ్వలో మరో పేకాట స్థావరంపై దాడి చేసి వారి నుంచి రూ.10.400 నగదుతోపాటు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై విజయవాడలో చికిత్స పొందుతున్న ఒక వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఏలూరు గిలకలగేటు ప్రాంతానికి చెందిన దారా వెంకటేశ్వరావు(58) ఒక ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. గత నెల 24న ఇంటికి వెళ్తుండగా రామమహల్ సెంటర్ వద్ద మోటార్‌సైకిల్‌పై నుంచి పడిపోవడంతో గాయాలయ్యాయి. విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

ఇళ్ల స్థలాల పేరిట మోసం!

వైసీపీ నేత ఇంటి వద్ద బాధితుల ఆందోళన - తీసుకున్న డబ్బు చెల్లించాలని డిమాండ్



మోరు రామరాజు ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న వడ్డీగూడెం గ్రామస్తులు

ఏలూరురూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని పెదపాడు మండలం వడ్డిగూడెం గ్రామానికి చెందిన వైసీపీ నేత మోసానికి పాల్పడ్డారంటూ పలువురు ఆందోళనకు దిగారు. గత వైసీపీ పాలనలో ఇంటి స్థలాలు ఇప్పిస్తానంటూ సుమారు రూ.57 లక్షలు తీసుకుని ఇవ్వకుండా తమను మోసం చేశాడంటూ వడ్డిగూడెం ప్రజలు ఆరోపించారు. ఈ మేరకు బాధితులు సోమవారం శనివారపేటలోని కట్టా సుబ్బారావుతోటలోని తన ఇంటి వద్ద పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. తమకు డబ్బు తిరిగి చెల్లించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. బాధితులు ముంగర విష్ణు, జయమంగళ హరి బాబు, మంటపాల మారుతి, సర్పంచ్ జయ మంగళ దేవి మాట్లాడుతూ మోరు రామరాజు ఆనుపత్రి 15 ఏళ్ల క్రితం, పొలం కొనుగోలు చేసి, స్థలాలు ఇప్పిస్తామంటూ 560 మంది నుంచి రెండో విడతగా సుమారు 57లక్షలు వసూలు చేశా న్నారు. వడ్డీగూడెం గ్రామస్తులు సొసైటీగా ఏర్ప రుచుకున్న చేపల చెరువు లీజుకు తీసుకుని వాటి డబ్బు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. కాలం గడిచే కొద్ది స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించకుండా తమ డబ్బులు తిరిగి ఇవ్వడం లేదని ఆరోపించా రు. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఆది నుంచి రామరాజు దౌర్జన్యం చేసేవారంటూ ఆరోపించారు. ఇటీవల తమకు న్యాయం చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను కోరగా ఇదే విషయంపై మోరు రామరాజు సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యేపై దుర్భాషలాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడే బైఠాయిస్తామని మహిళలు హెచ్చరించారు. మధ్యాహ్నం అక్కడే టీ టౌన్ పోలీసులు వచ్చి నిరసన కొనసాగించారు. త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, బాధితులను సముదాయించే ప్రయత్నం చేసినా వినకుండా ఆందోళనను కొనసాగించారు. మంటపాల మారుతి, బసవ శాస్త్రి, మోరు వెంకన్న, జయ మంగళ దుర్గారావు, బలే వీర్రాజు, మోరు సత్తిరాజు, గంటసాల సుబ్బరాజు, ముంగర రామకృష్ణంరాజు పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

ఏలూరు క్రైం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఏడుగురిని ఏలూరు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు తన సిబ్బందితో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి గుర్తించారు. వారిని సోమవారం ఏలూరు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కెజియా కోర్టులో హాజరుపరిచారు. అతిగా మద్యం తాగిన ఒకరికి నాలుగు వేల రూపాయలు, మిగిలిన ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున జరిమానా విధించారు. ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు తెలిపారు. ఏడుగురు మద్యం బాబులకు ఏలూరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పొలాల్లో ఉన్న కారు

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

కామవరపుకోట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలో కొత్తూరు గ్రామం వద్ద కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. కారులో ఉన్న డ్రైవర్‌ను స్థానికులు సురక్షితంగా బయటకు తీశారు.

దమ్మపేటకు.. ఏపీ దొంగకోళ్ల పంచాయితీ

చోరీ జరిగిన కోళ్ల విలువ రూ.4 లక్షలు - చింతలపూడి పోలీసుల విచారణ

దౌర్జన్యం చేశారంటూ ఏపీ పోలీసులను స్టేషన్‌లో అప్పగించిన గ్రామస్థులు


చింతలపూడి పోలీసుల వాహనాన్ని అడ్డుకున్న దమ్మపేట వాసులు

దమ్మపేట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీలోని ఏలూరు జిల్లా చింతలపూడి మండలం పట్టాయిగూడెంలో గ్రామంలో జరిగిన పందెం కోళ్ల ఆచూకీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో లభ్యమయ్యాయి. దీంతో చింతలపూడి పోలీసులు దమ్మపేట పోలీసులకు సమాచారం ఇవ్వకుండా విచారణకు రావడం, తమపై దౌర్జన్యం చేశారంటూ దమ్మపేట వాసులు వారిని స్థానిక పోలీసులకు అప్పగించడం వివాదాస్పదమైంది. ఈఘటనకు సంబంధించి వివరాలివీ.. పట్టాయిగూడెం గ్రామానికి చెందిన రంగారావ్ అనే రైతుకు చెందిన సుమారు రూ.4లక్షలు విలువ ఉండే నాలుగు పందెం కోళ్లు 10రోజుల క్రితం చోరీకి గురయ్యాయి. దీనిపై సదరు రైతు అక్కడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం తన పందెం కోళ్లు భద్రాద్రి జిల్లా దమ్మపేటలో ఉన్నట్లు సదరు రైతుకు సమాచారం అందటంతో.. చింతలపూడి పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్, ఒక కానిస్టేబుల్, మరో హోం గార్డుతో కలిసి కోళ్ల ఆచూకీ కోసం సోమవారం ఉదయం దమ్మపేటకు చేరుకున్నారు. వీరితో పాటు నాలుగు కార్లలో మరికొంత మంది కూడా రావడంతో గ్రామంలో ఉత్కంఠ వాతావరణం ఏర్పడింది. ఈ క్రమంలో వారంతా దమ్మపేటకు చెందిన గోపవరపు శేషగిరి ఇంటికి వెళ్లి దొంగకోళ్లు కొనుగోలు చేశారంటూ 'గొడవకు దిగారు. ఈ క్రమంలో 'నీ భర్త ఎక్కడ' అంటూ ఇంట్లో ఉన్న రాజేశ్వరిపై ఏపీ పోలీసులు దురుసుగా మాట్లాడటంతో పాటు ఇంటి గేటు మూసివేసి ఇంట్లోని సీసీ కెమెరాలు, హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆమె తన భర్త ఇంట్లో లేడని చెప్పినా పట్టించుకోకుండా వారంతా ఆ ఇంటి వద్ద హల్‌చల్ చేయడంతో పాటు రాజేశ్వరి, ఆమె కుమార్తెను దుర్భాషలాడుతూ అక్కడే కట్టేసి ఉన్న వేరే రెండు కోళ్లను పోలీసులు స్వాధీనం చేసుకుని తమ కారులో వేసుకొన్నారు. శేషగిరి ఇంటి వద్ద గొడవ జరుగుతున్న విషయం తెలుసుకున్న స్థానిక కాంగ్రెస్ నాయకుడు చిన్నశెట్టి యుగంధర్, పలువురు గ్రామస్థులతో కలిసి అక్కడికి చేరుకుని ఏపీ పోలీసులను వెళ్లనీయకుండా వాహనాన్ని అడ్డుకుని దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని ఏపీ పోలీసులు, వారి వెంట వచ్చినవారిని దమ్మపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న చింతలపూడి సీఐ క్రాంతి కుమార్ సోమవారం రాత్రి దమ్మపేట చేరుకుని తమ సిబ్బందిని విడిపించుకెళ్లారు. ఈ విషయంపై దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

రేపు మహిళల ఆరోగ్య కార్యక్రమం

ఆకివీడు సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):ఆకివీడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆరోగ్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మెడికల్ అధికారి ఆదిలక్ష్మి అన్నారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. మహిళలు, పిల్లల సంరక్షణ, వ్యాధి నిర్ధారణ, టీకాలు, పోషకాహారం మొదలైన వాటిపై నిపుణులైన వైద్యులతో సూచనలు, సలహాలు, చికిత్సలు చేస్తామన్నారు. స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రేపు జిల్లా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం

తణుకు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో ఈనెల 17వ తేదీ ఉదయం 9గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి.వి. షణ్ముఖ రెడ్డి చెప్పారు. మహిళల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు హాజరుకావచ్చునని తెలిపారు. ఎంపీ పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విచ్చేస్తారని తెలిపారు.

యువ ఇంజనీర్లదే కీలకపాత్ర : జేసీ

ఘనంగా విశ్వేశ్వరయ్య జయంతి .. ఇంజనీర్లకు సన్మానం



డీఎన్ఆర్ కళాశాలలో ప్రసంగిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):సమాజ నిర్మాణంలో యువ ఇంజనీర్ల పాత్ర కీలకమైందని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఇంజనీరింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ ముందుకుసాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేషన్ సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణ రాజు, ప్రిన్సిపాల్ అంజనికుమార్ పాల్గొన్నారు.

భీమవరం క్రైం: నేటి ఆధునిక యుగంలో రోజుకో కొత్త ఆవిష్కరణలు బయటకు వస్తున్నాయంటే అందులో ఇంజనీర్ల పాత్ర ఎనలేనిదని సౌత్ సెంట్రల్ రైల్వే ఇంజనీర్ (ఎస్ఎస్ఇ) డి.ఆనందరావు, ఎ.సత్యనారాయణరావు అన్నారు. భీమవరం రైల్వే జంక్షన్‌లో ఆరుగురు రైల్వే ఇంజనీర్లను సత్కరించారు. ఎస్ఎస్ఈ గిరిబాబు, సాయి, ఏడీఆర్ చౌదరి, ఎస్.సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

ఆకివీడు: భారతజాతి గర్వించదగ్గ కట్టడాలకు పునాదివేసిన పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని ఆదర్శ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొలిపాకుల చంద్రశేఖర్ అన్నారు. విద్యుత్ ఏఈ ఏ.ఎల్.రత్నాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ టి.శ్రీ నివాసరావు, విశ్రాంతి ఇంజనీర్లు పల్లి అప్పిరెడ్డి, దాసరి వెంకట సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు.

భీమవరం టౌన్:వీరవాసరం పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థి, నేటి ఆర్‌అండ్‌బీ మండల ఇంజనీర్ మూర్తిని ఘనంగా సన్మానించారు. వీరవాసరం కళాపరిషత్, కాపు సర్వీస్ క్లబ్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ, వనిత క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బి. లక్ష్మీ కళ్యాణి, భీమవరం కళా పరిషత్ అధ్యక్షుడు జవ్వాది దాశరధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. దీనికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్టు డైరెక్టర్ కె.సాయి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కళాశాల ఛైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి త్రినాధ్, డైరెక్టర్ శ్రీహరి, ఎంవి రామచంద్రరావు, ప్రిన్సిపాల్ ఎస్.సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గోపి చంద్, మూర్తి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్:వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో ఆచార్యుడు, రీసెర్చ్ డిన్ డాక్టర్ వంకమామిడి శ్రీనివాస నరేష్ విశిష్ట ఇంజనీర్ అవార్డు అందుకున్నారు. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణా విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ రాంజీ, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు చేతుల మీదుగా అందుకున్నారు.

పాలకొల్లు అర్బన్/ పాలకొల్లు టౌన్:ఛాంబర్స్ కళాశాలలో పాలక మండలి అధ్యక్షుడు కెవిఆర్ నరసింహారావు అధ్యక్షతన ఇంజనీర్లు తుమ్మలపల్లి సుబ్బారావు, వలవల రవీంద్రలను ఘనంగా సత్కరించారు. యునైటెడ్ కాపు ఇంటర్నేషనల్ సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్లు ఎంవి శర్మ, పోలిశెట్టి పెద్దిరాజు, నల్లమోతు ప్రసాద్‌లను సత్కరించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శిడగం సతీష్, పాస్ట్ గవర్నర్ డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి (బాబ్జీ) ఆధ్వర్యంలో ఇంజనీర్లు తోట మోహనరావు, బి.వెంకటరమణ, కలువకొలను దుర్గా రామస్వామి, అడబాల శ్రీనివాస్, చిటికెన రామకృష్ణ, కె.రాజకుమార్, జి సతీష్‌లను ఘనంగా సత్కరించారు.

తహసీల్దార్‌గా ఫరూఖ్ బాధ్యతల స్వీకారం



ఆకివీడు సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):తహసీల్దార్‌గా షేక్ అహ్మద్ ఫరూఖ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్‌గా చేసి భీమవరం కలెక్టరేట్‌కు ఏవోగా బదిలీపై వెళుతున్న నండూరి వెంకటేశ్వరరావు, ఆర్ఐ అంజనేయులును సిబ్బంది అభినందించారు. ఎంపీడీవో మార్కండేశ్వరరావు పాల్గొన్నారు.

కాళ్లలో డ్రెయినేజీ సమస్యపై ఫిర్యాదు

కాళ్ల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాళ్లలోని 1, 2వ వార్డుల్లో సరైన డ్రెయినేజీ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పీజీఆర్ఎస్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై నీరు నిలిచి రోజుల తరబడి ఉంటున్నాయని వాపోయారు. దీనివల్ల తామంతా అనారోగ్యం బారిన పడుతున్నామన్నారు.అదేవిధంగా మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యశాలలో రెగ్యులర్ డాక్టర్ లేకపోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని ఫిర్యాదు చేశారు.

ఆకివీడులో మూడు అర్జీలు

తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మూడు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో మార్కండేశ్వరరావు, తహసీల్దార్ ఫరూఖ్ తెలిపారు. మండల అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరం ఏర్పాటుకు ధర్నా

నరసాపురం రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):సీతారాపురం సచివాలయం వద్ద సోమవారం గ్రామానికి చెందిన ఎస్టీలు ధర్నా చేశారు. ఆధార్ క్యాంపు ఏర్పాటు చేసి కార్డులు లేని వారందరికీ కార్డులు ఇవ్వాలని నినాదాలు చేశారు. కార్యదర్శి ఎం.శ్రీనివాస్, వీఆర్వో నాగేంద్రకు వినతిపత్రాలందించారు.

ఉపాధి హామీలో అవినీతిని అరికట్టాలి

తణుకు రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):జాతీయ ఉపాధి హామీ పథకంలో అవినీతి లేకుండా చేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు, సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు కోరారు. సోమవారం తణుకులోని సీపీఎం అమర వీరుల భవనంలో జరిగిన తణుకు మండల వ్యవసాయ కార్మిక సంఘం 3వ మహాసభలో పాల్గొని మాట్లాడారు. ఈసభకు బండారు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తేసేందుకు అవినీతి జరుగుతుందని, దీని కోసం కొత్త యాప్‌లను తీసుకొచ్చిందన్నారు. దీని వలన ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

యనమదుర్రు ఉధృతి పరిశీలన

అత్తిలి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిపురం శివారు పెంటపాడు మండలం రామచంద్రపురం వద్ద యనమదుర్రు డ్రెయిన్ పరిస్థితిని తహసీల్దార్ దర్శక వంశీ పరిశీలించారు. ప్రస్తుతం నీటి ప్రవాహం 25.10 అడుగులు ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.





తణుకులో ఉపాధ్యాయులను సత్కరించిన ఎమ్మెల్యే ఆరిమిల్లి.. పాలకొల్లులో చెక్కులు అందిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

కూటమి ప్రభుత్వంలో విద్యకు ప్రాధాన్యం

తణుకు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యావ్యవస్థకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) ఆధ్వర్యంలో తణుకు డివిజన్‌లో ఎంపిక చేసిన 57మంది ఉత్తమ ఉపాధ్యాయులను టీచర్స్ డే పురస్కరించుకొని ఘనంగా సత్కరించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, అనపర్తి ప్రకాశరావు, ప్రగతి రాజా, ఎల్.కె.త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు



వల్లూరులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని..

ఆచంట, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వేమవరం, వల్లూరు గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. సోమవారం వేమవరం, వల్లూరు గ్రామాల్లో పర్యటించారు. వేమవరంలోని తాడేరుపాలెం వద్ద బ్రిడ్జి నిర్మాణం, వల్లూరు గెద్దాడవారిపాలెం వద్ద వంతెన నిర్మాణం చేపడతామన్నారు. దీనికి సంబంధించిన అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, చిలుకూరి సీతారామ్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పేద మధ్య తరగతి వర్గా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. స్థానిక మంత్రి కార్యాలయంలో సోమవారం 83 మందికి రూ.32 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కూటమి నేతలతో కలిసి అందజేశారు.

విద్యార్థి సంఘాలపై నిబంధనలు తొలగించాలి

భీమవరం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):విద్యార్థి సంఘాలను స్కూల్స్, కళాశాలల్లోకి అనుమతులను నిషేధిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను తక్షణమే రద్దు చేయాలని, ఇది అప్రజాస్వామికమని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి డిమాండ్ చేశారు. భీమవరంలో స్థానిక మెంటేవారి తోటలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహం సమీపంలో సోమవారం ఈ జీవోను రద్దు చేయాలని నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



యలమంచిలిలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి

పాలకోడేరు, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అక్టోబరు 15 వరకు ప్రతి గ్రామంలోనూ పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నట్లు మండల పశు వైద్యాధికారి టి.హేమ తెలిపారు. పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి చొంగ కారడం, కాలి గిట్ల పుండ్లు, చూడి ఇసుకపోవడం, పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడం వంటి లక్షణాలు కలిగి ఉండటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వ్యాధి నిరోధక టీకాలు తమ పశువులకు వేయించుకోవాలని కోరారు.

యలమంచిలి: యలమంచిలి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి పి.చంద్రశేఖరరెడ్డి, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆకివీడు రూరల్: నాణ్యమైన పశు సంపద, పాలదిగుబడి పెంచుకోవాడానికి గాలికుంటువ్యాధి టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి భార్గవి సత్య అన్నారు. గుమ్ములూరులో పశువులకు టీకాలు వేశారు. ఈ వ్యాధి వల్ల పశువులలో పనిసామర్థ్యం, పాల ఉత్పత్తి తగ్గి, మరణాలు సంభవిస్తాయని తెలిపారు.

ఆర్టిస్ట్స్, పెయింటర్స్ కార్యవర్గం



సమావేశమైన ఆర్టిస్ట్స్, పెయింటర్స్

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టిస్ట్స్ అండ్ పెయిం టర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక సంఘ భవనంలో సోమవారం జరిగింది. 2025- 27 సంవత్సరాల కు గానూ జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడుగా నీలం రవి, కార్యదర్శిగా అధికారి పవన్ కుమార్, కోశాధికారిగా బొప్పే దుర్గా ప్రసాద్ షణ్ముఖ రావు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడుగా కోరుకొండ సుబ్బారావు, సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు జిఎస్ఎన్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చలపాటి నాగేంద్ర ప్రసాద్, లీగల్ అడ్వజర్‌గా బొంతు వెంకట తిరుమలరావు ప్రమాణ స్వీకారం చేశారు.

28, 29 తేదీల్లో అమ్మవారి పునః ప్రతిష్ఠ

మొగల్తూరు. సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి):మొగల్తూరు గ్రామ దేవత నడివీధి ముత్యాలమ్మ అమ్మవారి పూరిపాక, అమ్మవారి ఘటాలు దగ్ధమైన విషయం పాఠకులకు విధితమే. అయితే అమ్మవారి పూరిపాకను తిరిగి నిర్మించడం, ఘటాలను ఏర్పాటు చేసే కార్యక్రమాలపై చర్చించేందుకు అన్ని ప్రాంతాలకు చెందిన గ్రామ పెద్దలు, భక్తులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సిద్ధాంతి అనిల్ కుమార్ ఆచార్యులు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28, 29 తేదీల్లో అమ్మవారి పున ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠలకు చేయాల్సిన కార్యక్రమాలను గ్రామస్థులకు వివరించారు.

సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ

భీమవరం క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్ర జ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భీమవరం క్రైం పోలీస్ స్టేషన్‌సీఐ డి. రాంబాబు అన్నారు. ఈగల్ సెల్ ఆధ్వర్యంలో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులకు సోమవారం క్రైం పోలీస్‌స్టేషన్ వద్ద సైబర్ నేరాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీఐ రాంబాబు మాట్లాడుతూ అనుకోని రీతిలో సైబర్ నేరానికి గురైతే కంగారు పడకుండా వెంటనే 1930 ఫోన్ నంబర్‌కు, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ సీహెచ్.మహేష్ మాట్లాడుతూ ప్రజల బలహీనతలే సైబర్ నేరస్థుల బలంగా మారిందని అన్నారు.

మన డబ్బులు.. మన లెక్కలు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి):మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలంటే మన డబ్బులు మన లెక్కలు ఎంతో అవసరమని ఏపీఎం లక్ష్మి పేర్కొన్నారు. అప్పారావుపేటలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మన డబ్బులు, మన లెక్కలుపై గ్రామంలో మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం సర్పంచ్ ఆరుగొల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

అర్జీల పరిష్కారం పారదర్శకతతో ఉండాలి : జేసీ



అర్జీదారులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి):పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీల పరిష్కారం పారదర్శకత, నాణ్యతతో ఉండాలని, ఫిర్యాదుదారులతో మాట్లాడి నిర్ణీత గడువు లోపు పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లాలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 219 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి అర్జీదారుల దరఖాస్తులను పరిశీలించి, ఆధార్ నెంబర్ ద్వారా ఆన్లైన్ టోకెన్ జారీ చేయాలని అధికారులకు సూచించారు.

ప్రజా సమస్యల పట్ల అశ్రద్ధ వద్దు : ఎస్పీ



భీమవరం క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా చట్టపరిధిలో శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వయంగా స్వీకరించారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీసు శాఖ ఉండాలన్నారు. పలు సమస్యలపై 9 అర్జీలను స్వీకరించారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు పాల్గొన్నారు.